# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు న్యూఢిల్లీలో సమావేశమయ్యారు.
- ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.
- ఉక్కు రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌లో మెండుగా అవకాశాలు ఉన్నాయని మంత్రి టి.జి భరత్ చెప్పారు.
- రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోను MSME పార్కులు నెలకొల్పాలని యోచిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు.
- దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు.

=======================

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా తమ మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. మే నెల 2వ తేదీన అమరావతి రాజధాని నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేందుకు ఆయనను ఆహ్వానించారు. సుమారు లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన వివిధ ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అలాగే దీనికి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. ముఖ్యమంత్రి ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేసి, రేపు ఉదయం ఢిల్లీ నుండి విశాఖకు రానున్నారు.

=======================

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్.. పిఠాపురం నియోజకవర్గంలో 100 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ఈరోజు శంకుస్థాపన చేశారు. పిఠాపురంలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. రైతులకు వ్యవసాయ పనిముట్లను, మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎన్డియే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధికి 100 కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. 30 పడకల ఆసుపత్రిని 100 పడకలకు పెంచుతున్నామని వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

శాంతి భద్రతల విషయంలో రాజీ పడబోమని, అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా.. చర్యలు తప్పవని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

=======================

ఉక్కు రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖా మంత్రి టి.జి భరత్ చెప్పారు. భారత ఉక్కు మంత్రిత్వ శాఖ, ఫిక్కీ ఆధ్వర్యంలో ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇండియా స్టీల్ 2025 పేరుతో ఉక్కు రంగంపై 6వ అంతర్జాతీయ ప్రదర్శన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా మంత్రి అధ్యక్షతన “సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ - అపార అవకాశాలు” పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల ప్రతినిధులతో మంత్రి భరత్ ముఖాముఖిగా మాట్లాడి... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుండి భారీ స్టీల్ కంపెనీల ప్రతినిధులు వచ్చారని, ఈ వేదికను సద్వినియోగం చేసుకొని రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

=======================

రాష్ట్రానికి చెందిన వారు ఎవరైనా పాకిస్తాన్ నుండి స్వదేశానికి రావడానికి అడ్డంకులు ఉంటే ఎన్నారై విభాగం ద్వారా పరిష్కరిస్తామని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పాకిస్తాన్‌లో ఉన్న ఆంధ్రులు తిరిగి వస్తే వారి నైపుణ్యతను అనుసరించి భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈరోజు విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు 30 వేల మంది వితంతువులకు పెన్షన్ కొత్తగా ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఎం.ఎస్.ఎం.ఈ. పార్కులు నెలకొల్పాలని యోచిస్తున్నామని, వచ్చే నెల ఒకటో తేదీన నెల్లూరులో ఒక పార్కును ప్రారంభించి అక్కడి నుంచే దృశ్యమాధ్యమ విధానంలో మరొక 50 పార్కులను ప్రారంభిస్తామని తెలిపారు. రానున్న 2 సంవత్సరాల్లో 175 నియోజకవర్గాల్లో ఎం.ఎస్.ఎం.ఈ. పార్కులను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

విరామం

=======================

దివ్యాంగులు తమలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో 380 అత్యాధునిక ఉపకరణాలను ఈరోజు విశాఖలో 241 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... దివ్యాంగుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసిందన్నారు. అలాగే అనేక పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. విశాఖ జిల్లాలో దివ్యాంగుల శారీరక, మానసిక దృఢత్వం కోసం 200 కోట్ల రూపాయలతో 25 ఎకరాల్లో అత్యాధునిక పారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=======================

వెనుకబడిన వర్గాల యువత అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్ లో బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రాన్ని మంత్రి ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గది, అభ్యర్థుల విశ్రాంతి గదులు, స్నానాల గదులను మంత్రి పరిశీలించారు. సీ సెట్ పరీక్ష జరుగుతున్న తరగతిని కూడా పరిశీలించారు. డిజిటల్ లైబ్రరీని సందర్శించి, అక్కడి అభ్యర్థులతో ఆమె మాట్లాడారు. స్టడీ మెటీరియల్ సరఫరా, అధ్యాపకుల బోధన, తరగతుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. భోజన సదుపాయం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై మంత్రి ఆరా తీశారు.

=======================

ఇరపై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అల్లూరి సీతారామ రాజు జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబందించిన అంశాలపై సంయుక్త జిల్లా కలెక్టర్ అభిషేక్ గౌడ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పం వికసిత్ భారత్ 2047, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో నిర్వహించే కార్యాచరణ ద్వారా జిల్లా పరిధిలో ఇప్పుడున్న సవాళ్లను అధిగమించి విజయవంతంగా “వికసిత్ అల్లూరి సీతారామరాజు జిల్లా”గా రూపుదిద్దుకోవాలనే లక్ష్యంతో ఈ సమీక్ష జరిగింది.

=======================

రాష్ట్రంలోని 27.39 లక్షల గిరిజనుల సమగ్ర సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా అండగా నిలుస్తున్నాయని చెప్పారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా, జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి గిరిజన కళా ప్రదర్శనలు, నృత్యోత్సవాలు, ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలు, విశాఖ, విజయవాడ, తదితర చోట్ల నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. వివిధ పథకాల ద్వారా పక్కా ఇళ్ల నిర్మాణం, రోడ్లను కలిపే కార్యక్రమాలు, పైప్ ద్వారా తాగునీటి సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్లు, హాస్టళ్ల నిర్మాణం, నిర్వహణ మొదలైన కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

=======================

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న “మిషన్ శక్తి” కార్యక్రమంలో భాగంగా, “ప్రధాన మంత్రి మాతృ వందన యోజన” (PMMVY)పై ఓరియెంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం ఈరోజు విశాఖలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి పాల్గొని మాట్లాడుతూ... మహిళల ఆరోగ్య పరిరక్షణలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం లక్ష్యాలు, ప్రయోజనాలు, పథకం అములులో భాగస్వాముల పాత్రను వివరించారు.

=======================
=======================